
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గురువారం తూర్పుడెల్టాకు 4,700 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1,400క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



మేధకు పదును

విద్యార్థుల్లో వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. - 8లో▸

పింఛన్ల పంపిణీ



రాజమహేంద్రవరం రూరల్: తూర్పుగోదావరి జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ గురువారానికి 96.73 శాతం జరిగింది.

న్యూస్‌రీల్

చిన్నారి వైద్యానికి రూ.4.50 లక్షల సాయం



బంధువులకు సాయాన్ని అందిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

అంబాజీపేట: ప్రమాదవశాత్తూ వంట నూనెలో పడి తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడాది చిన్నారి గుత్తుల సూర్య వైద్య ఖర్చుల నిమిత్తం అంబాజీపేట ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు రూ.4.50 లక్షల సాయాన్ని గురువారం బాబు తల్లిదండ్రులకు, బంధువులకు అందజేశారు. గంగలకుర్రు పెదగరువుకు చెందిన గుత్తుల చంద్రరావు రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లిపోయాడు. అక్కడ స్వీట్‌స్టాల్ నిర్వహిస్తున్నాడు. తన ఏడాది కుమారుడు సూర్యబాబు తన ఇంటి పక్కను మరొక స్వీట్‌స్టాల్ నిర్వహిస్తున్న షాపు దగ్గరకు ఆడుకునేందుకు వెళ్లాడు. ఈ సమయంలో పోయి నుంచి దించిన వేడి కళాయిలో ఆ బాలుడు ప్రమాదవశాత్తు పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడని బంధువులు తెలిపారు. దాంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. రోజుకు రూ.వేలల్లో ఖర్చు అవ్వడంతో దాతల సాయం చేయాలని వాట్సాప్ ద్వారా అర్థించారు. బాలుడి పరిస్థితిని గమనించి ఫ్రెండ్స్ ఫర్‌వెర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ద్వారా రూ.4.50 లక్షలను సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, దొమ్మేటి నాగన్న, పెద్ద తదితరుల సమక్షంలో బాలుడు తండ్రి చంద్రరావుకు, అతని బంధువులకు అందించినట్టు ఆర్గనైజేషన్ సభ్యులు నాగాబత్తుల జాను, ముడిదుడ్డి రాము, జీవన్, బూసి రాంబాబు, వరప్రసాద్, ప్రసాద్, సిద్ధూ, రాజేష్, ఈశ్వర్, రమేష్ తెలిపారు.

7న ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇంటర్వ్యూలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఈనెల ఏడో తేదీన సీనియర్ రెసిడెంట్ పోస్టుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సైన్స్, విజయవాడ నోటిఫికేషన్ ప్రకారం సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరిగే ఇంటర్వ్యూలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

భర్తీ చేయనున్న పోస్టులు

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, అనస్థీషియా, ఆప్తాల్మజీ, ఈఎన్‌టీ, డీవీఎల్ పల్మనాలజీ, రేడియో రోగ నిర్ధారణ, రేడియాలజీ, అత్యవసర వైద్యం, డెంటిస్ట్రీ, డెంటల్ సర్జరీ, అనాటమీ, ఫిజియోలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయి.

18న సీఎం జగన్ సామర్లకోట పర్యటన



హెలిప్యాడ్ కోసం స్థలం పరిశీలిస్తున్న జేసీ, దొరబాబు, ఇతర అధికారులు

సామర్లకోట: ఈ నెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో జాయింట్ కలెక్టరు ఇలక్కియాతో కలిసి ఈటీసీ లేఅవుట్‌లో జగనన్న కాలనీలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. కాలనీలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని జేసీ సూచించారు. రోడ్డు మార్జిన్‌లో మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ ప్రదేశాన్ని, హెలికాప్టర్ దిగడానికి సామర్లకోట-పెద్దాపురం రోడ్డులోని లేఅవుట్‌లను పరిశీలించారు.

రాష్ట్రంలో ఆరు లక్షల ఇళ్లు పూర్తి...

దొరబాబు ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు,బలహీన వర్గాల్లో అర్హులైన సుమారు 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 17వేల కాలనీల్లో 20.80లక్షల మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొనడానికి సామర్లకోట పర్యటన ఖరారైందన్నారు.

అవినీతి రహిత పాలన



"అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారదర్శకమైన పాలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పంచాయతీల్లో యూపీఐ, డిజిటల్ ఆధారిత చెల్లింపుల వలన ప్రజాధనం పంచాయతీ ఖాతాకు నేరుగా జమవుతుంది. దుర్వినియోగానికి ఏ మాత్రం ఆస్కారం ఉండదు."

– గొలుగూరి అన్నపూర్ణ, సర్పంచ్, అర్తమూరు

డిజిటల్లు.. దీని స్టైలే వేరు!

- పంచాయతీల్లో 'పే' చేసే ఏర్పాట్లు
- పారదర్శకంగా లావాదేవీల నిర్వహణ
- పన్నులు, ఇతర ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే
- ఆగస్టు 15 తర్వాత అమలుకు కసరత్తు
- అవగాహన బోర్డుల ఏర్పాటు



డిజిటల్ ఆధారిత చెల్లింపులపై అర్తమూరు పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మండపేట: పంచాయతీల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అక్రమాలకు తావివ్వకుండా ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించేలా ఆదేశాలిచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి నూతన విధానం అమలుల్లోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పంచాయతీల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో కొందరు సిబ్బంది చేతివాటం చూపించేవారు. వసూలైన ఇంటి పన్నులను సొంత అవసరాలకు వాడుకునేవారు. అధికారుల తనిఖీల్లో ఇవి వెలుగుచూశాక సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేసేవారు. లేదంటే అంతే!. లెక్కా జమ సరిగా ఉండేది కాదు. ఇటువంటి ఆరోపణలపై జిల్లాలోని మూడు పంచాయతీల్లో అధికారులు విచారణ చేస్తున్నారు. ఇకపై ఇటువంటి అక్రమాలకు డిజిటల్ చెల్లింపులతో తెర పడనుంది. పన్నుల మొత్తాన్ని ఒక్క రూపాయి కూడా నగదు రూపంలో పంచాయతీ అధికారులు స్వీకరించరు. వసూలైన ప్రతీ రూపాయి నేరుగా పంచాయతీ ఖాతాకు జమ కానుంది. పంచాయతీ ఖర్చులు సైతం సంబంధిత కాంట్రాక్టరుకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం వలన ఎటువంటి అక్రమాలకు తావుండదు.

క్యూ ఆర్ కోడ్ అనుసంధానంతో..

జిల్లాలో 385 పంచాయతీల నుంచి ఏటా ఇంటి పన్నుల రూపంలో రూ.29.95 కోట్లు, కుళాయి, ఇతర పన్నుల ద్వారా రూ.6.64 కోట్లు వసూలవుతున్నాయి. ఆగస్టు 15 తర్వాత పన్నుల లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారా చేపట్టనున్నారు. పంచాయతీల్లో జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు, ఇతర సేవలు పొందేందుకు చెల్లించాల్సిన రుసుముతో పాటు ఇంటి యజమానులు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్‌గానే చెల్లించాలి. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ అనుసంధానం చేసుకోవాలి. ఈ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మెషీన్లను కూడా పంచాయతీలకు సమకూర్చనున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పంచాయతీల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. పన్నుల వసూలు మాత్రమే కాకుండా పంచాయతీలు కొనుగోలు చేసే బ్లీచింగ్, పారిశుధ్య పరికరాలు, వీధిలైట్లు, ఇతర సామగ్రితో పాటు పంచాయతీల్లో చేసే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్లకు ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంది. దీనివలన పంచాయతీల్లో అక్రమాలు జరిగేందుకు వీలుండదని అధికారులు అంటున్నారు.

అర్తమూరులో..

మండలంలోని అర్తమూరు పంచాయతీ కార్యాలయం వద్ద డిజటల్ పంచాయతీకి సంబంధించిన ఫ్లెక్సీని సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఎంపీడీఓ ఐ.రాజు, కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో పన్నుల వివరాలు

మండలాలు	:22
గ్రామపంచాయతీలు	:385
ఇంటి పన్ను డిమాండ్ :	రూ.23,95,18,741
కుళాయి, ఇతర పన్నులు :	రూ. 6,64,26,619

పారదర్శకంగా నిర్వహణ



పంచాయతీల నిర్వహణ పారదర్శకంగా జరిగేందుకు ఆన్‌లైన్ లావాదేవీలు దోహదపడతాయి. ఈ నెల 15వ తేదీ నుంచి డిజిటల్ చెల్లింపుల విషయమై ఇప్పటికే అన్ని పంచాయతీలకు ఆదేశాలిచ్చాం. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలకు అవగాహన కలిగించేందుకు కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం.

– వి.కృష్ణకుమారి, డీపీఓ,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రజాధనం దుర్వినియోగం కాదు



అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ ద్వారానే జరగడం వలన ప్రజాధనం దుర్వినియోగం అయ్యేందుకు ఆస్కారం ఉండదు. డిజిటల్ చెల్లింపులపై అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఐ రాజు, ఎంపీడీఓ, మండపేట

'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'తో మేలు : మంత్రి వేణుగోపాలకృష్ణ



లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కె.గంగవరం: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలకు పూర్తి ఆరోగ్యం సిద్ధిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కె.గంగవరంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం బాలింతలు, గర్భిణులకు టేక్ హోం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1,500 నుంచి రూ.1,700 విలువైన పది రకాల వస్తువులు ఉన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా పేదల సంక్షేమం కోసం నవరత్న పథకాలు అమలు చేసి ప్రజలకు అండగా ఉన్నారని గుర్తు చేశారు. ఇకపై ప్రతి నెలా సంపూర్ణ పోషణ కిట్లు ఇంటి వద్దకే అందిస్తారని తెలిపారు. ఎంపీపీ నాగమణి, రామచంద్రపురం ప్రాజెక్టు సీడీపీఓ వీవీ లక్ష్మీ, డీటీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్ పిల్లి రాంబాబు, కోటి లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

ప్రతి బాధితుడిని ఆదుకుంటాం

కలెక్టర్ హిమాన్షు శుక్లా



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్

సాక్షి అమలాపురం: గోదావరి వరద బారిన పడిన ప్రతి బాధితుడుకి సాయం అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు నిత్యావసర వస్తువులు, పరిహారం అందజేస్తున్నామని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. అమలాపురం గురువారం ఆయన వరద సహాయ, పునరావాస కార్యక్రమాలపై ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 10 మండలాల్లోని 36 గ్రామాలు వరద బారిన పడ్డాయని తెలిపారు. 4,550 కుటుంబాల్లోని 10,612 మంది వరద ప్రభావానికి గురయ్యారన్నారు. జిల్లాలో ఒక ఇల్లు దెబ్బతిందని, 32 పునరావాస కేంద్రాలను ప్రారంభించి 81,943 ఆహార ప్యాకెట్లను సరఫరా చేశామని పేర్కొన్నారు. 2.08 లక్షల వాటర్ ప్యాకెట్లు, 20 లీటర్ల సామర్థ్యం గల 22,400 క్యాన్లు ద్వారా సురక్షిత తాగునీరు సరఫరా చేశామన్నారు. 78 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు కలెక్టర్ శుక్లా వివరించారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్

గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టిన సహాయక, పునరావాస చర్యలపై ఒక్క ఫిర్యాదు కూడా ముంపు బాధితుల నుండి రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఐదు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సీఎం జగన్ గురువారం రాత్రి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జిల్లాలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అపూర్వ సన్మానం



గురువు సాంబశివరావును సత్కరించి గ్రూపు ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

95 ఏళ్ల గురువుకు 70 ఏళ్ల పూర్వ విద్యార్థుల సత్కారం

అమలాపురం టౌన్: యాభైఏళ్ల కిందట తమకు పాఠాలు చెప్పి, తమ వృద్ధికి కారణమైన నాటి ప్రధానోపాధ్యాయుడిని 70 సంవత్సరాల వయస్సు దాటిన పూర్వ విద్యార్థులు సత్కరించారు. 95 ఏళ్ల వృద్ధాప్యంలో ఆ గురువును సన్మానించుకొని మురిపోయిన అ'పూర్వ' ఘట్టం అమలాపురంలో గురువారం జరిగింది. మలికిపురం మండలం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1968–69 మధ్య ఎస్ఎస్ఎల్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు 1989లో ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుతం 95 ఏళ్ల వృద్ధాప్యంతో అమలాపురం పోస్టల్ కాలనీలో స్థిరపడ్డ చీర్ల సాంబశివరావును సత్కరించారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి వృత్తి విరమణ చేసిన వృద్ధ విద్యార్థులు తమ గురువుకు పాదాభివందనం చేసి, ఆయన ముందు కూర్చుని నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. ఉద్యోగ, వృత్తి విరమణ చేసిన విషయాలు, తమకు ఎంతమంది పిల్లలు, వారు ఎలా స్థిర పడ్డారో వివరిస్తున్నప్పుడు ఆ గురువు మురిసిపోయారు. పూర్వ విద్యార్థుల్లో ఒకరైన ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు గురువు సాంబశివరావుకు తమ పూర్వ విద్యార్థులను ఒక్కొక్కరి పూర్వాపరాలు చెప్పి నాటి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేశారు. పూర్వ విద్యార్థులైన విశ్రాంత ఉద్యోగులు యెనుముల సుబ్బారావు, జాన సుబ్రహ్మణ్యేశ్వరరావు, చెల్లుబోయిన రామచంద్రరావు ప్రసంగించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో స్థిర పడ్డ 20 మంది పూర్వ విద్యార్థులు తమ గురువు సాంబశివరావును అన్నేళ్ల తర్వాత చూసి ఉద్వేగానికి గురయ్యారు. అందరూ గ్రూపు ఫొటో దిగారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి

- 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజల వద్దకు పాలన
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: అర్హులైన ప్రతి ఒక్కరికి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలనే త్రికరణ శుద్ధితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం వినూత్న పథకాలను అమలు చేస్తోందన్నారు. వివిధ కారణాలతో కొందరు పలు పథకాల లబ్ధి, ప్రభుత్వ సేవలు పొందలేకపోతున్నారని చెప్పారు. దీనిని గుర్తించి గడచిన నెలరోజులుగా ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం చేపట్టిందన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఇంటింటా సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయ పరిధిలో సుమారు 1,46,00,000 కుటుంబాలకు సంబంధించి సర్వే నిర్వహించి 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. ఏ రాష్ట్రంలో ఈ పథకం లేదన్నారు. దీనివల్ల రాష్ట్రంలో 97శాతం మందికి లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో సుమారు 93 లక్షల సర్టిఫికెట్లు జారీ చేసినట్టు చెప్పారు.

మన జిల్లా ప్రథమం

జగనన్న సురక్ష అమలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. దాదాపు 515 సచివాలయాల పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించినట్టు తెలిపారు. వీటి ద్వారా వివిధ సేవలు, ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు 7,80,029 టోకెన్లు జారీ చేశామన్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి 7,65,694 పరిష్కరించినట్టు తెలిపారు. సచివాలయాల వారీగా శిబిరాలు నిర్వహించి అవసరమైన సేవలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. ఇంత బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 99 శాతం మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నూరు శాతం సక్సెస్ అయిందని రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తున్నారని రెండోసారి ఆయన ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే పొన్నాడ ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెయ్యల చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, కోలాబాబ్జీ ఉన్నారు.

జ్వరాలొస్తాయ్.. జాగ్రత్త!

- సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటే మేలు
- శుక్రవారాన్ని డ్రై డేగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పరిశుభ్రతతోనే నివారణ సాధ్యమంటున్న వైద్యులు

ఆలమూరు: వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, తుపానుల ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత తీసుకుంటూ, సురక్షిత తాగునీరు సేవిస్తూ కనీస జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాలోని 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారులు సీజనల్ వ్యాధుల నివారణకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. గ్రామాల్లో జ్వర పీడితుల వివరాలను గుర్తించేందుకు వైద్యారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా సర్వే నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో సంభవించే అంటువ్యాధుల వ్యాప్తి–నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలపై ఇప్పటికే జిల్లా వైద్యారోగ్యశాఖ విరివిగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తోంది. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని దోమల నివారణకు తగిన జాగ్రత్తలను తీసుకునే విధంగా ప్రభుత్వం ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా నిర్ణయించింది.

దోమలవ్యాప్తిని అరికట్టాలి

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను చక్కగా ఉంచుకుని దోమల వ్యాప్తిని అరికడితే డెంగీ, మలేరియా, డయేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు తదితర సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చునని డాక్టర్లు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో దోమల గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. ఆ దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇంట్లో వ్యర్థాలు, రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కుండీలలో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. ఈ విషయంలో అవగాహన కల్పించడానికి ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సూచనలు, సలహాలను అందజేస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

వ్యాధులు–లక్షణాలు

డయేరియా: నీళ్ల విరేచనాలు ఎక్కువగా అవుతుంటాయి. కలుషిత నీరు గాగడం వల్ల గాని, నిల్వ ఉన్న పదార్థాలను భుజించడం వల్ల గాని ఈ వ్యాధి సోకే అవకాశముంది.

చికున్ గున్యా: ఆకస్మాత్తుగా జ్వరం వస్తుంది. ఆ సమయంలో ఒళ్లు, కీళ్ల నొప్పులు ఉంటాయి.

డెంగీ: తీవ్రంగా జ్వరం వస్తుంది. ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి ఉంటుంది. హఠాత్తుగా శరీరంపై పొక్కులు వస్తాయి. మలవిసర్జనలో రక్తం పడుతుంది.

పచ్చ కామెర్లు: కలుషిత నీరు తాగితే ఈ వ్యాధి సోకుతుంది. శరీరం అంతా పచ్చగా మారుతుంది. అశ్రద్ధ చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

ఫైలేరియా: క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల ఇది వ్యాపిస్తుంది. మురుగు కుంటల్లో ఈ దోమలు వ్యాప్తి చెందుతాయి. ఫైలేరియా ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ మరో వ్యక్తిని కుడితే ఈ వ్యాధి సోకుతుంది.

మెదడువాపు: ఈ వ్యాధి సోకితే అపస్మారక స్థితికి వెళతారు. తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లను అసాధారణంగా తిప్పుతారు




ఆలమూరు మండలం సంధిపూడిలో నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నివారణ మార్గాలు

- వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలి.
- కాచి చల్లార్చి వడబోసిన స్వచ్ఛమైన నీటినే తాగాలి.
- రెబలెంట్స్ క్రీమ్‌ను ఒంటి నిండా పూసుకోవాలి.
- దోమలు కుట్టకుండా పూర్తిగా దుప్పటి కప్పుకోవాలి.
- ఇంటి కిటికీలు, సెప్టిక్‌ట్యాంకులపై చిక్కం ఏర్పాటు చేయాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి.
- తినుబండారాలు, తాగునీటిపై ఎప్పటికప్పుడు మూతలు వేయాలి.

లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి



వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో పాటు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంది. శరీరంలో ఏవిధమైన మార్పుల సంభవించినా సత్వరమే వైద్యుల్ని సంప్రదించాలి. వారి సలహాలు పాటించి సత్వరమే చికిత్స చేయించుకోవాలి. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

– పి.భవానీశంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదపళ్ల

క్లుప్తంగా

దొంగతనం కేసులో మూడు నెలల జైలు

సామర్లకోట: దొంగతనం కేసులో ఒక వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు ఇచ్చినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2017, అక్టోబర్ 26వ తేదీన సామర్లకోటకు చెందిన కొల్లాటి తాతాజీ పెద్దాపురం రోడ్డులోని స్టేట్‌బ్యాంకులో రూ.1.40 డిపాజిట్టు చేయడానికి వెళ్లారు. సొమ్ము స్కూటీ డిక్కీలో పెట్టి బ్యాంకులోకి వెళ్లి మేనేజర్‌తో మాట్లాడి వచ్చిన తరువాత డిక్కీ తెరచి చూస్తే కనిపించలేదని అప్పట్లో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి ముద్దాయి మొండ్రాగుర్తి లాజర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఉషా లక్ష్మీకుమారి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీగా విజయ వాదించారని తెలిపారు.

పంట కాలువలో కారు బోల్తా
– డ్రైవర్, ఇద్దరు మహిళలు సురక్షితం

పి.గన్నవరం: ఆర్‌పీ రోడ్డులో మండలంలోని బెల్లంపూడి వద్ద గురువారం ఒక కారు అదుపు తప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయింది. నీటిలో కొట్టుకుపోతున్న కారు నుంచి డ్రైవర్‌తో పాటు, ఇద్దరు మహిళలను స్థానికులు రక్షించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు అదుపుతప్పి పంట కాలువ రేవులో పడిపోయింది. దీనిని గమనించిన సీహెచ్ సత్యనారాయణ అనే వ్యక్తి కేకలు వేయడంతో స్థానికులు, వచ్చి కారులోని ముగ్గురిని సురక్షితంగా బయటకు తీశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్‌లో శుక్రవారం సాయంత్రం మృతి చెందిన వృద్ధుని వివరాలు లభ్యమయ్యాయి. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం తూర్పుగోదావరిజిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నానికి చెందిన వల్లభని సత్యనారాయణ(78)గా గుర్తించారు. మృతుడు సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, భార్య. పెద్దకుమారుడు చనిపోవడంతో చాగల్లులో చిన్నకుమారుడి వద్ద ఉంటున్నాడు. ఆర్థిక పరిస్థితుల రీత్యా కుటుంబానికి భారం కాకూడదని భావించాడు. మరోవైపు అనారోగ్యం వెంటాడడంతో తరచూ రాజమహేంద్రవరంలో వైద్య పరీక్షలు నిర్వహించుకునేవాడు. ఆ విధంగానే ఇంటి వద్ద నుంచి ఆస్పత్రికి వెళ్తున్నానని బుధవారం ఉదయం బయలుదేరాడు. రాజమహేంద్రవరంలో ఆగకుండా కాకినాడ చేరుకుని సూర్యారావుపేట బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తిమ్మాపురం పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబీకులు గురువారం పోలీసుస్టేషన్‌కు వచ్చారు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మేధకు పదును

- 6–11వ తరగతి విద్యార్థుల ప్రతిభకు పరీక్ష
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాన్వేషణ పరీక్షను ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దేశంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుంది.

సెప్టెంబర్ 15 వరకు గడువు

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది మే 21వ తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, వచ్చే నెల 15వ తేదీన గడువు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లోగో

జూనియర్, సీనియర్ విభాగాల్లో..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులకు జూనియర్, 9–11 తరగతులకు సీనియర్ గ్రూపుగా ఈ పరీక్ష ఉంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

100 మార్కులకు పరీక్ష

నమూనా పరీక్ష అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. అయితే ఇందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్–ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు, బీర్బల్ సహానీ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బిలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజిక్, రీజనింగ్‌పై 10 ప్రశ్నలు ఉంటాయి.

రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారిలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6–11 తరగతులకు గాను మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబరు 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయ స్థాయి పోటీలకు ఈ విధంగా..

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023–24లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1–3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు..



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఒక చక్కని వేదిక. 20 నుంచి 30 వరకు విద్యార్థుల నమోదు ఉంటే ఆ పాఠశాలలకు పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.

– పీవీఎల్ఎన్ శ్రీరామ్, స్టేట్ కోఆర్డినేటర్, ఏపీ విద్యార్థి విజ్ఞాన్ మంథన్, అమలాపురం

అధిక సంఖ్యలో విద్యార్థులను ప్రోత్సహించాలి



ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో ఈ పరీక్షలో పాల్గొనేలా హెచ్ఎంలు కృషి చేయాలి. విద్యార్థుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచి, పరీక్షపై అవగాహన పెంచాలి. రోజూ ఒక గంట పాటు కోచింగ్ ఇవ్వాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి..



పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌ఎఫ్‌ఐ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వవచ్చు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఈదరపల్లిలో విజిలెన్స్ దాడులు

- రూ.4.41 లక్షల విలువైన నిషేధిత సిగరెట్ ప్యాకెట్ల స్వాధీనం
- యజమానిపై కేసు నమోదు



అధికారులు స్వాధీనం చేసుకున్న నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు

అమలాపురం రూరల్: ఈదరపల్లి గ్రామంలో గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.4.41 లక్షల విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో భూషణం కాలనీలో శ్రీనివాస జనరల్ స్టోర్‌కు చెందిన రెండు ప్రాంతాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ టాక్స్ అధికారులతో కలిపి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. షాపులో బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు అయిన పారిస్, సిగ్నేచర్ పల్స్, ఒరిస్, గోల్డ్ క్వీన్, సిగ్నేచర్ గోల్డ్, ఈఎస్ఎస్ఈ స్పెషల్ గోల్డ్, గోల్డ్ విమల్, గోల్డ్ ఫిల్టర్, లైట్, గోల్డ్ విమల్ మింట్‌ను గుర్తించారు. రూ.4,41,060 విలువైన మొత్తం 6,680 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని బోనం శ్రీనివాస్ సంబంధిత వ్యక్తులపై సీవోటీపీఏ యాక్ట్ – 2003 కింద క్రిమినల్ కేసు నమోదు కోసం టౌన్ పోలీసు స్టేషన్ కు అప్పగించారు. ఈ నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను మూడు నెలల క్రితం తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరానికి చెందిన దింతకుర్తి సుబ్రహ్మణ్యం (కోటయ్య) నుంచి కొనుగోలు చేసినట్లు షాపు యజమాని తెలిపారు. అధికారులు ఎల్ఎం యాక్ట్–2009 కింద కేసు నమోదు చేశారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలునాయుడు, కార్యాలయ ఎస్సై సత్యకిషోర్, ఏవో భార్గవ మహేష్, కానిస్టేబుళ్లు కిషోర్, లోవరాజు పాల్గొన్నారు.

రత్నగిరిపై జల ప్రసాద కేంద్రాలు



జలప్రసాద కేంద్రం ప్రారంభోత్సవంలో ఈఓ చంద్రశేఖర్ అజాద్, దివీస్ ప్రతినిధులు



జలప్రసాద కేంద్రం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబొరేటరీస్ సంస్థ రూ.90 లక్షల వ్యయంతో ఆరుచోట్ల 'జల ప్రసాద కేంద్రాలు' (ఆర్వో వాటర్ ప్లాంట్లు)ను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఈఓ ఎస్.చంద్రశేఖర్ అజాద్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన దివీస్ లాబొరేటరీస్ ప్రతినిధులతో కలిసి జల ప్రసాద కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి దేవస్థానంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధిస్తున్నందున ఈ జలప్రసాద కేంద్రాలు భక్తుల దాహార్తిని తీర్చడానికి బాగా ఉపయోగపడతాయన్నారు. దివీస్ ప్రతినిధులు సుధాకర్, వాసు, బాబు, నాగరాజు, బాలకృష్ణ, తేజ శ్రీనివాస్, దేవస్థానం ఈఈ నరసింహరెడ్డి , డీఈ రాంబాబు, గుర్రాజు పాల్గొన్నారు.

సీఆర్వో కార్యాలయం ప్రారంభం

స్థానిక శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం టోల్‌గేట్ వద్ద గల పాత ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్వో)ను గురువారం ఈఓ ఎస్.చంద్రశేఖర్ అజాద్ ప్రారంభించారు. ఈ కార్యాలయంలో సత్రం గదులకు రిజర్వేషన్ చేయడంతో బాటు, రత్నగిరిపై వివిధ సత్రాల గదుల ఖాళీల వివరాలు కూడా భక్తులకు తెలియజేయనున్నారు. దీనివలన దేవస్థానం సత్రాలలో గదులు ఖాళీ ఉంటే నేరుగా సత్రాలకు వెళ్లి గదులు అద్దెకు తీసుకునే అవకాశం కలుగుతుంది.



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

అండర్–14,16 క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం అండర్–14, 16 విభాగంలో క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపికలకు అండర్–14లో 110, అండర్–16లో 140 మంది హాజరయ్యారు. వీరికి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. వీరికి మ్యాచ్‌లు నిర్వహించి తుది జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ జట్లు త్వరలో జరగనున్న నార్త్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో జిల్లా తరఫున పాల్గొంటాయని సంఘ కార్యదర్శి పి.సత్యనారాయణ తెలిపారు.

రేషన్ షాపుల డీలర్లపై కేసుల నమోదు



బెండపూడి రేషన్‌షాపులో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

తొండంగి: మండలంలోని బెండపూడిలో గురువారం విజిలెన్స్ అధికారులు రేషన్‌షాపులపై దాడులు నిర్వహించి అవకతవకలకు పాల్పడుతున్న డీలర్లపై 6 ఏ కేసులు నమోదు చేశారు. బెండపూడి గ్రామంలో రాజమహేంద్రవరానికి చెందిన విజిలెన్స్ తహసీల్దార్ విజయ్‌కుమార్ అధికారుల బృందం షాపు నంబర్ 33లో రికార్డులకు, బియ్యం నిల్వకు తేడాలున్నట్టు గుర్తించారు. ఈ రేషన్ షాపునకు సంబంధించిన రేషన్ సరఫరా వాహనం (ఎండీవో)లో 165 కిలోల బియ్యం, 30 కిలోల పంచదార అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రేషన్ డీలర్ కృష్ణవేణి, వెహికల్ నిర్వాహకునిపై 6ఏ కేసు నమోదు చేశారు. రేషన్‌షాపు నంబర్ 50లో కూడా బియ్యం నిల్వలు రికార్డుల ప్రకారం సక్రమంగా లేనట్టు గుర్తించడంతోపాటు రేషన్ సరఫరా వెహికల్‌లోనూ రేషన్ బియ్యం, పంచదార ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. డీలర్ దడాల సావిత్రిపైనా, వాహన నిర్వాహకుడిపైనా 6 ఏ కేసులు నమోదు చేసినట్టు ఎంఎస్ఓ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు సత్యనారాయణ, ఎంఎస్ఓ ఎస్. కిరణ్‌కుమార్ ఉన్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి




మృతుడు వెంకటరమణ

పిఠాపురం: నిర్మాణంలో ఉన్న భవనంపై సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడిన ఒక వ్యక్తి మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధికి చెందిన దండు వెంకటరమణ 45 భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం స్థానిక కరణంగారితోట ఏరియాలో ఒక నిర్మాణంలో ఉన్న భవనానికి సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ సుపత్రికి తరలించారు.

యువ వైద్యురాలి మృతితో విషాదం

యానాం: యానాం పట్టణానికి చెందిన యువ వైద్యురాలు మేడిశెట్టి భవ్యసాయి(25) గురువారం విశాఖపట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. లారీ ఆమె నడుంపై నుంచి వెళ్లిపోవడంతో మృతి చెందిందన్న వార్త యానాంలోని స్థానికులను కలచివేసింది. ఇక్కడ మున్సిపల్ ఇంజినీరుగా పనిచేసి ఇటీవలి బదిలీపై పుదుచ్చేరి వెళ్లిన మేడిశెట్టి రామలింగమూర్తి (రాము) చిన్న కుమార్తె భవ్యసాయి శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బట్టిగళ్లూరు పీహెచ్‌సీలో వైద్యురాలిగా పని చేస్తోంది. గురువారం విశాఖపట్టణంలో కాంపిటీటివ్ ఎగ్జామ్‌కు బండిపై వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొని ఆమె మృతి చెందిందని స్థానికులకు సమాచారం అందింది. మూడేళ్ల క్రితం పెద్దకుమార్తె చెన్నైలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ డెంగీ వ్యాధికి గురై మృతి చెందింది. ఇప్పుడు రెండోకుమార్తె మృతిచెందడం స్థానికులు, మున్సిపల్ ఉద్యోగులకు విషాదాన్ని మిగిల్చింది.

విద్యుదాఘాతంతో షిఫ్ట్ ఆపరేటర్ మృతి



రవిశేఖర్ (ఫైల్)

అనపర్తి: మండలంలోని పీరారామచంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా (ఔట్ సోర్సింగ్) విధులు నిర్వహిస్తున్న గెద్దాడ రవి శేఖర్(40) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన విద్యుత్‌శాఖ ఏఈ వీరభద్రరావు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనాపల్లికి చెందిన రవిశేఖర్ పీరారామచంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఐదు సంవత్సరాలుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు కుమారులతో గ్రామంలోనే కుటుంబంతో నివాసముంటున్నాడు. గురువారం విధులు ముగించుకున్న రవిశేఖర్ గ్రామానికి చెందిన ఓ వినియోగదారుడి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకుగాను స్తంభం ఎక్కాడు. దీంతో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై స్తంభం నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రవిశేఖర్ ఎడమచేయి మణికట్టు భాగం పూర్తిగా కాలిపోగా, కాలికి బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది, కుటుంబ సభ్యులు క్షతగాత్రుని అనపర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇక్కడి వైద్యుల సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా వైద్య సేవలు పొందుతూ రవిశేఖర్ మృతిచెందాడు. ఈ ఘటనపై కాకినాడ జీజీహెచ్ నుంచిఅందిన సమాచారంతోపాటు మృతుడి భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అనపర్తి పోలీసులు తెలిపారు.

వర్ణనాతీతం



ఆలమూరులో రెండు రకాల పూలు పూసిన గులాబీ మొక్క

ఆలమూరు: గులాబీలో అనేక రకాల రంగుల మొక్కలుంటాయి. ఒక్కొక్క మొక్క ఒక్కో రకం పూలు పూస్తుంది. ఒక మొక్కకు ఒక రంగు గులాబీ పూస్తేనే మురిసిపోతుంటాం. అలాంటిది ఒకే మొక్క కొమ్మకు రెండు రంగులు కలిగిన గులాబీ పూలు పూస్తే ... ఆ ఆనందం మాటల్లో వర్ణించలేనిది. మండల కేంద్రమైన ఆలమూరులో పీవీవీ సుబ్బారాయుడుకు చెందిన పెరట్లో పెంచుకుంటున్న గులాబీ మొక్క కొంతకాలంగా ఎర్ర రంగు గులాబీలను పూసింది. నాలుగు రోజుల క్రితం ఒకే కొమ్మలో పూసిన రెండు పుష్పాలు ఎదుగుతున్న క్రమంలో రంగు మార్చుకున్నాయి. అందులో ఒకటి ఎర్రగాను, మరోటి పింక్ రంగులోను ఉంది. ఈ పూల మొక్కను చూసేందుకు స్థానికులు ఆసక్తిని కనబరుస్తున్నారు. మొక్క తయారీలో అంటు పద్ధతి విఫలమైనా, జన్యుపరమైన లోపాల వల్ల ఈ విధంగా రెండు రకాల పూలు పూయవచ్చునని కొత్తపేట హెచ్ఓ కోటేశ్వరరావు పేర్కొన్నారు.